నత్తనడకన డ్రెడ్జింగ్ పనులు

- ప్రతిపాదనలకే పరిమితం
- వర్షాకాలంలో వరద బెడద
- రైతాంగానికి తప్పని తిప్పలు



తుప్పలతో పూడుకుపోయిన శంకరగుప్తం మేజర్ డ్రైన్

మలికిపురం: శంకరగుప్తం మేజర్ డ్రైన్ మరమ్మతులు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందాన మారింది. ఏడేళ్ల క్రితం టీడీపీ హయాంలో పనులు ప్రారంభించినప్పటికీ ఆ పనులు డ్రైన్ సగం వరకే పరిమితమయ్యాయి. ఆధునీకరణలో భాగంగా ఈ డ్రైన్ మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ పనులు అరకొరగా జరగడంతో అత్యవసరమైన ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరితగతిన పూర్తి చేసేందుకు 2012లో అప్పటి ప్రజా ప్రతినిధులు ఆధునీకరణ ప్యాకేజీ నుంచి విడగొట్టి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ డ్రైన్ పూడిక తీయాల్సి రావడంతో డ్రెడ్జింగ్ చేయడమే మార్గమని ఆ దిశగా సుమారు 15 రోజుల పాటు డ్రైనేజీ అధికారులు డ్రైన్ పొడవునా పడవలతో తిరిగి సుమారు రూ.35 కోట్లతో కేవలం డ్రెడ్జింగ్‌కు ప్రతిపాదనలు రూపొందించారు. అదీ కాక మరో రూ.14 కోట్లతో ఈ డ్రైన్‌పై శిథిలస్థితికి చేరిన వంతెన ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపారు. అయితే డ్రైన్ డ్రెడ్జింగ్ సగం వరకూ మంజూరైంది. ఏడేళ్ల క్రితం కేశనపల్లి నుంచి కరవాక వరకూ పనులు చేపట్టి పూర్తి చేశారు. కేశనపల్లి వైపు నుంచి కేశవదాసుపాలెం వైపు పెండింగ్‌లో పడింది. సుమారు 25 కిలోమీటర్ల పొడవున్న ఈ మేజర్ డ్రైన్ మరమ్మతులు లేక అనేక ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉంది. ఎట్టకేలకు ఇరిగేషన్ ఆధునీకరణ పనుల్లో చేర్చి పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు నిర్ణయించారు. పైగా తొలుత అధికారులు రూపొందించిన ప్యాకేజీల్లో ధరలు గిట్టుబాటు కాక కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితుల్లో పదే పదే టెండర్లు పిలిచినా ఫలితం లేకపోయింది. చివరకు గత పదేళ్ల క్రితం ప్యాకేజీల నుంచి విడగొట్టి శంకరగుప్తంతో పాటు పలు డ్రైన్లకు విడివిడిగా టెండర్లు పిలిచారు. అయితే క్రాప్ హాలిడే ఇవ్వడం కుదరక పనులు వాయిదా పడుతూ వచ్చాయి. చివరకు ఆధునీకరణ నుంచి తప్పించి డ్రెడ్జింగ్‌కు ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించి సగం పనులు నిర్వహించారు. డ్రైన్ పనుల్లో భాగంగా తూర్పుపాలెం-పల్లిపాలెం, పడమటిపాలెం-గుబ్బలపాలెం, శంకరగుప్తం-అడవిపాలెం, చింతలమోరి-శృంగవరప్పాడు గ్రామాల మధ్య వంతెనల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. వీటిలో పడమటిపాలెం-గుబ్బలపాలెం మధ్య వంతెన మినహా మిగిలిన వంతెనల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గొల్లపాలెం, తూర్పుపాలెం సరిహద్దులో కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద డ్రైన్ బెండు తొలగించి డ్రైన్ సరాసరి చేయాల్సి ఉన్నా ఆ పనులు అటకెక్కాయి. డ్రైన్ మిగిలిన భాగం మరమ్మతులపై నీలినీడలు అలముకున్నాయి. దీంతో ముంపు సమస్య మళ్లీ మొదటికే వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజోలు దీవిలో మిగిలిన పనులు ఎలా ఉన్నా కనీసం శంకరగుప్తం డ్రైన్ పనులైనా త్వరితగతిన పూర్తి చేయాలని ఈ డ్రైన్ పరిధిలోని రైతాంగం కోరుతోంది. రాజోలు దీవిలో దాదాపు అన్ని మీడియం డ్రైన్‌లు ఈ శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో పడి సముద్రంలో కలుస్తాయి. ఇది మరమ్మతులు లేక వర్షాకాలంలో వర్షాలకు, వరదలకు కూడా ఈ డ్రైన్ పొంగి చుట్టుపక్కల సుమారు 12 గ్రామాలను ముంచెత్తుతోంది. అంతేకాక రాజోలు దీవిలోని అన్ని మీడియం డ్రైన్‌ల మురుగునీరు ఈ డ్రైన్ ద్వారానే సముద్రంలో కలవాల్సి ఉండడంతో ఆ సమయంలో పంట పొలాలు కూడా ముంపు బారిన పడుతున్నాయి. నెలల తరబడి ముంపు, మురుగు నీరు గ్రామాల్లో తిష్ట వేసి, రైతులకు ముంపు సమస్యతో పాటు ప్రజల అనారోగ్యాలకు కారణమవుతోంది.

ముంపుతో నష్టపోతున్నాం



శంకరగుప్తం మేజర్‌డ్రైన్ పూడికతీత పనులు జరగక రైతాంగం తీవ్ర అవస్థలు పడుతుంది. డ్రైన్ పరిధిలో పంట చేలు, నివాస ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ముంపు వల్ల పంట నష్టపోతున్నాం. త్వరితగతిన పనులు చేపట్టాలి.

– చెవ్వాకుల ప్రభుకుమార్, రైతు, శంకరగుప్తం

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తా



దేవీప్రకాష్‌ను సత్కరిస్తున్న వేగివారిపాలెం కమిటీ సభ్యులు

రాజోలు: వైఎస్సార్ సీపీ విజయానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పాముల దేవీప్రకాష్ అన్నారు. వేగివారిపాలేనికి చెందిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి కుమారుడైన దేవీప్రకాష్ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతో గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆయనను అభినందిచారు. గ్రామశాఖ అధ్యక్షుడు బళ్ల లక్ష్మణరావు, మండల పార్టీ మేధావుల విభాగం ప్రధాన కార్యదర్శి జాలెం జనార్దనరావు, పప్పొప్పుల సాయిబాబు, విప్పర్తి మహేష్ తదితరులు దేవీప్రకాష్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు క్షేత్రస్థాయిలోకి తీసుకు వెళ్తానన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావులకు దేవీప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలపై రేపు అవగాహన

మలికిపురం: ఈ నెల 21న స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈ బి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే అవగాహన సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ సమస్యలు, సరఫరాలో హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జాప్యం తదితర అన్ని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు తప్పక వినియోగించుకోగలరని సూచించారు.

హాస్టల్‌కు వాషింగ్ మెషీన్ బహూకరణ



రిజిస్ట్రార్ ఏసునాయన అందించిన వాషింగ్ మెషీన్

మామిడికుదురు: స్థానిక బాలికల వసతి గృహానికి మంగళవారం పెదపట్నంలంక గ్రామానికి చెందిన కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎం.ఏసునాయన వాషింగ్ మెషీన్ అందించారు. ఉపాధ్యాయుడు బయ్యా మోహనరావు గీజర్‌ను, రిటైర్డ్ టీచర్ కుసుమ ప్రకాష్ బాలుర హాస్టల్‌కు గీజర్‌ను అందజేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని స్కూల్ హెచ్ఎం బి.చిరంజీవి తెలిపారు. దాతలను ఆయన అభినందించారు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని ఎంపీపీ మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి నిమిత్తం రూ.1,13,500 మంజూరయ్యాయన్నారు. వీటితో ఆస్పత్రికి ఉపయోగపడే పరికరాలకు, అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. ఎంపీపీ వెంట తహసీల్దార్ బి.చినబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏపీఎల్ నరసింహం, వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఆర్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అప్పాజీ తదితరులు

ఆలమూరు: మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పీఎంఆర్ పుస్తకావిష్కరణ జరిగింది. విద్యార్థుల ప్రగతిని నమోదు చేసేందుకు వీలుగా ముద్రించిన ఈ పుస్తకాన్ని స్థానిక ఎంఈఓ ఆకార్యాలయంలో ఎంఈఓ బి.అప్పాజీ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగపడే ఈపీఎంఆర్ పుస్తకాన్ని ఆకర్షణీయంగా ముద్రించి ఉచితంగా అందజేసిన ఎస్టీయూ శాఖను పలువురు అభినందించారు. మండల శాఖ అధ్యక్షుడు సలాది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వాసా దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు కేఎస్ఎన్ మూర్తి, ఎం.రాజగోపాల్, జీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతకు సత్కారం



అధ్యాపకుడు పద్మనాభంను సత్కరిస్తున్న అధ్యాపకులు

రాజోలు: ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు టీవీఎస్ పద్మనాభాన్ని మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో పద్మనాభం అభినందన సభ నిర్వహించారు. 36 ఏళ్లుగా ఆయన ఫిజిక్స్ అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా ఆయా కళాశాలల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నారని ప్రిన్సిపాల్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు ఆయన అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయనను సహచర అధ్యాపకులు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పాశర్లపూడిలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: గోదావరి వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి సూచించారు. ఆమె మంగళవారం పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న కాజ్‌వేను పరిశీలించారు. అప్పనపల్లి తీరంలోని బాలబాలాజీ స్నాన ఘట్టం వద్ద వరద పరిస్థితిని సమీక్షించారు. మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో పలు అంశాలపై మాట్లాడారు. అధికారులు ఇచ్చే ముందస్తు హెచ్చరికలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల నుంచి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వ పరంగా బోట్లు ఏర్పాటు చేశామన్నారు. లైఫ్ జాకెట్లు, గతఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రోడ్డు జాయింట్ల పటిష్టతకు చర్యలు



పి.గన్నవరం కొత్త అక్విడెక్టు రోడ్డుపై కొలతలు తీస్తున్న డీఈఈ

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై రోడ్డు ఎక్స్‌టెన్షన్ జాయింట్ల వద్ద తరచూ పగుళ్లు ఏర్పడటంతో, ఆ గోతుల్లో వాహనాలు పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. దీంతో జాయింట్ల వద్ద పటిష్టత చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు ఇరిగేషన్ డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు తెలిపారు. జాయింట్ల మధ్యలో స్ట్రిప్ స్టీల్ షీట్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వివరించారు. దీనికి సుమారు రూ.20 లక్షలు ఖర్చవుతుందని ఆయన వివరించారు. అక్విడెక్టు రోడ్డుపై మంగళవారం ఆయన కొలతలు తీశారు. ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.23 వేల విరాళం



దాత సూర్యనారాయణరాజుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగొండ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన పెనుమత్స చిట్టి రామసత్య సూర్యనారాయణ రాజు మంగళవారం రూ.23,000 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్ము ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకుడు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది అభినందించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.కేపీ రాజు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉన్నత విద్యామండలి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్లు ఈనెల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులంతా వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల ఆఫీసులో లేదా 9704302775, 8179824845, 9490186830, 9989027808. నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు కోరారు.

విఘ్నేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అర్చక సిబ్బంది, గ్రామస్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 90 రోజులకు గాను స్వామివారి హుండీ ఆదాయం రూ.44,11,902 లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో అల్లు దుర్గాభవాని తెలిపారు. ఇంకా స్వామివారి హుండీలో వెండి 173 గ్రాములు, 33 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయని తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారులు అమలాపురం జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ, ట్రైనింగ్ సహాయ కమిషనర్ ఎం.మంజులాదేవి, అమలాపురం ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వర రావు ఉన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చక స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమలపై కేంద్ర మంత్రితో చర్చ



ఎంఎస్ఎంఈ కేంద్ర సహాయ మంత్రితో మాట్లాడుతున్న కోనసీమ నేతలు

మామిడికుదురు: కోనసీమ ప్రాంతంలో కొబ్బరి పీచు బొమ్మలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాశర్లపూడికి చెందిన బీజేపీ యువమోర్చా నేత కటికిరెడ్డి గంగాధర్ కేంద్ర మంత్రిని కోరారు. న్యూఢిల్లీలో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజేను సోమవారం కలిశారు. కోనసీమలో క్వాయర్ పరిశ్రమల అభివృద్ధి, చేతితో తయారు చేసే క్వాయర్ ఉత్పత్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై కొత్తగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, క్వాయర్ షోరూమ్స్, సీఎఫ్‌సీ కేంద్రం ద్వారా మార్కెటింగ్ సదుపాయం తదితర అంశాలపై చర్చించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సంబంధిత అడిషనల్ ఇన్‌చార్జ్ అరుణ్‌ను కలవాలని చెప్పారన్నారు. ఆతడిని కలిసి వీటికి సంబంధించిన విషయాలను సమగ్రంగా వివరించామని తెలిపారు.

హామీల అమలు బాబు డిక్షనరీలో లేదు



పల్లిపాలెంలో నాయకులతో కలసి జెండా ఆవిష్కరణ చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల హామీలను అమలు చేయడం చంద్రబాబు డిక్షనరీలో లేదని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం గూడపల్లి, పల్లిపాలెం గ్రామాల్లో పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పున్నం నాగేశ్వరావు అధ్యక్షతన, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, కోరుకొండ రవి అధ్యక్షతన, సర్పంచ్ నరసింహస్వామి నాయకత్వంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ వంచన ప్రచారం జరిగింది. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు ఏడాదిగా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, మహిళలకు స్త్రీనిధి పథకం ద్వారా ఇస్తానన్న నెలకు రూ.1500 ఇవ్వకుండా, మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా సంవత్సరం గడిపేసారని, చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తొలుత స్థానిక నాయకులతో వైఎస్సార్ సీపీ పతాకాన్ని గొల్లపల్లి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మాజీ, మండపేట పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, గుబ్బల మనోహర్, సహదేవ్, చింత ప్రసాద్, మోకా సురేష్, ఉచ్చుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన చేలలో జాగ్రత్తలు పాటించాలి



గంగలకుర్రులో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: భారీ వర్షాలకు ముంపునకు గురైన వరిచేల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.గిరిజారాణి, సహాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేటలో నీటమునిగిన వరి చేలను మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి పంట ఊడ్చిన దశ, పిలకలు దశలో ఉన్న వరి చేలు నీట మునిగాయన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజుల పాటు ముంపును తట్టుకుంటాయన్నారు. అలాగే ఎద పద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే వీలైనంత త్వరగా మడిలో నుంచి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరగట్టాలన్నారు. నీట మునిగిన వరి చేలల్లో 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. పిలకల దశలో మునిగితే సాధారణ రకాలు ఐదు రోజుల పాటు ముంపునకు తట్టుకునే ఎంటీయూ 1064, పీఎల్ఏ 1100 వంటి రకాలు వారం రోజుల వరకు మునక తట్టుకుంటాయన్నారు, ఆకులుపైకి కనిపిస్తూ 30–40 సెంటీ మీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతాల్లో ముంపుని తట్టుకుంటాయన్నారు. అదే ఎంటీయూ 1232 రకం అయితే 10–12 రోజుల పాటు తాత్కాలిక ముంపును కూడా తట్టుకుంటుందన్నారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు.

చిత్రం.. స్మృతుల చిహ్నం



సఖినేటిపల్లి వరల్డ్ ఫొటోగ్రఫీ డేలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



పి.గన్నవరంలో డాగూరే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు

అంబాజీపేట: గత స్మృతులు తీపి జ్ఞాపకాలకు ఫొటో ఉత్తమమైనదని అందరికీ అటువంటి మధురస్మృతులను మిగిల్చిన కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిరస్మరణీయులని సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవి పేర్కొన్నారు. అంబాజీపేట మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో అంబాజీపేటలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు యనమదల వెంకటరమణమూర్తి, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల రూపకర్త డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జెండా ఆవిష్కరించారు.

మామిడికుదురు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని కెమెరా సృష్టితోనే ప్రపంచంలో ప్రతి దృశ్యాన్ని సజీవంగా చూడగలుగుతున్నామని మండల శాఖ అధ్యక్షుడు కోటి, కార్యదర్శి హీరు పేర్కొన్నారు.

మలికిపురం: ఫొటోగ్రఫీ అనేది అరుదైన, అందమైన వృత్తి అని జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి అన్నారు. ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం బట్టేలంకలో సీనియర్ ఫొటోగ్రాఫర్ కందికట్ల రత్నబాబుకు శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తాడి సహదేవ్, జాషువా, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు. మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మలికిపురం కూడలిలో ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం జరిగింది. డాగూరే చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు వీరనారాయణ, మేడిద రాంబాబు, కడలి కృష్ణారావులను ఘనంగా సన్మానించారు.

సఖినేటిపల్లి: జీవితంలో శాశ్వత జ్ఞాపకాల చిత్రరూపం ఫొటోగ్రఫీ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ ఫొటోగ్రఫీ డే నిర్వహించారు. ఫొటోగ్రఫీ ఫీల్డ్‌కు విశేష కృషి చేసిన డాగూరే చిత్రపటం వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు, ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, నల్లి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఫొటోగ్రాఫర్లు సంఘటితంగా ఉండి, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీవీ రావు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం పి.గన్నవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అక్విడెక్టు పార్కులో ఉన్న డాగూరే విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. అంతకు ముందు చాకలిపాలెం నుంచి పి.గన్నవరం, ముంగండ మీదుగా మండలంలో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పోతవరంలోని యూనియన్ కార్యాలయం వద్ద మండలశాఖ అధ్యక్షుడు పెనుమాల శ్రీబాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు.

కొత్తపేట: కెమెరా సృష్టికర్త డాగూరే లక్షలాది మందికి ఉపాధి కల్పించిన మహనీయుడని సీనియర్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నామాల వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఫొటోగ్రాఫర్స్ అందరూ ఘనంగా జరుపుకొన్నారు. కొత్తపేట మెయిన్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. అంతతరం డాగూరే చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్స్ కె.శివకుమార్, వై.ప్రభాకర్, కె.భాస్కర్, వై.శివకళ్యాణ కుమార్, ఎస్.ఏడుకొండలు, జి.దసరా బుల్లోడు, బీఎస్.రంగనాథబాబు, బి.నాగమాణిక్యంలను ఘనంగా సన్మానించారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



సఖినేటిపల్లిలో వర్షపు నీటి గుంతల్లో గంబూషియా చేపలు వదులుతున్న డాక్టర్ దుర్గా కావ్య



కడలిలో గంబూషియా చేపలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

అంబాజీపేట: నీటి నిల్వల్లో దోమల లార్వాలను నిర్మూలించగలిగే సహజ పరిష్కారం గంబూషియా చేప (మస్కిటో ఫిష్)ల ద్వారా సాధ్యమవుతుందని సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీ రామారావు తెలిపారు. అంబాజీపేట పీహెచ్‌సీలో డాక్టర్ కేఎన్ శ్రీనివాస్ అధ్యక్షతన గంబూషియా చేపలను మంగళవారం పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వలు, చెరువులు, బావులు, మురుగుగుంతలు, నీటి నిల్వ ఉన్న వాటిలో ఈ గంబూషియా చేపలను వదిలిపెట్టాలన్నారు. ఈ చేప వల్ల రసాయన రహిత దోమల నియంత్రణ, సహజ పరిసరాలకు హాని లేకుండా నియంత్రిస్తుందన్నారు. డీఎంఓ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ చేపలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: దోమల లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలు ఎంతో ఉపయోగపడతాయని అమలాపురం డీఎల్‌పీఓ పి.బొజ్జిరాజు, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సత్యవతి తెలిపారు. పాశర్లపూడిబాడవలో మంగళవారం గంబూషియా చేపలను విడుదల చేశారు. మండలంలోని లూటుకుర్రు, ఈదరాడ, ఆదుర్రు గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి వాసు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, హెల్త్ హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వర్షపు నీరు నిల్వ ఉన్న నీటి గుంతల్లో దోమ లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలను సిబ్బంది వదిలారు. వీటిని సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో దోమల లార్వాలను గుర్తించిన గుంతల్లో వదిలినట్టు ఆమె వెల్లడించారు. సీహెచ్‌వో మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ స్వామి, సిబ్బంది బాలశంకర్, కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: దోమల లార్వా నివారించేందుకు గంబూషియా చేపలు ఉపయోగపడతాయని తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ అన్నారు. మంగళవారం రాజోలు సబ్ యూనిట్ పరిధిలోని గ్రామాల్లో మురుగు గుంతలలో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. కడలి గ్రామంలో మురుగు గుంతలు, నిలిచిపోయి ఉన్న వర్షపు నీటిలో ఈ చేపలను వదిలారు.

అయినవిల్లి: డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో చేసే దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆ లార్వా తినేందుకు మురుగు గుంతలు, ఉపయోగించని బావుల్లో గంబూషియా చేపలు వదిలారు.